క్లుప్తంగా

లివర్ వ్యాధిగ్రస్తుడికి సాయం

రావులపాలెం: మండలంలోని రావులపాడు గ్రామానికి చెందిన సూరిబాబు కొంత కాలంగా లివర్ సంబంధింత వ్యాధితో బాధపడుతున్నాడు. ప్రతి నెలా లివర్ క్లీనింగ్ చేయించుకోవడానికి, మందులకు, వైద్యం నిమిత్తం సుమారు రూ.ఐదు వేల వరకూ ఖర్చు అవుతుంది. పేదరికంతో ఇబ్బంది పడుతున్న సూరిబాబు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులను సాయం కోరగా ఆదివారం సేవా సమితి సభ్యులు అతని ఇంటికి వెళ్లి రూ.10 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయంగా అందజేశారు.

నీతి కథల ద్వారా జీవిత పాఠాలు

అంబాజీపేట: జీవితంలో నేర్వని పాఠాలను నీతి కథల ద్వారా తెలుసుకోవచ్చని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం చిన్నారులకు వివిధ అంశాలపై శిక్షణ అందించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పంచతంత్ర కథలు, నైతిక విలువల గల కథలు చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు గ్రంథాలయాలు వేదికలుగా మారాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతి రోజు గ్రంథాలయాలకు పంపాలన్నారు.

ఖరీఫ్‌కు ముందే భరోసా

- రైతు భరోసా పంపిణీకి ఏర్పాట్లు
- క్లస్టర్ పరిధిలో 38,005 మంది లబ్ధిదారులు
- రేపు రైతుల ఖాతాల్లో రూ.20.90 కోట్లు జమ


వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు

రాయవరం: ఖరీఫ్ సాగు ప్రారంభానికి ముందే రైతు భరోసా నగదు సాయాన్ని రైతులకు అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాదేశాల మేరకు అర్హులైన రైతులందరికీ డాక్టర్ వైఎస్సార్ భరోసా పథకం మంజూరు చేసేలా వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. 2022–23 సంవత్సరానికి అర్హులైన లబ్ధిదారులకు గతేడాది మే నెలలో నగదు జమ చేయగా, ఇప్పుడు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి విడత ప్రభుత్వం ఈ నెల 30న సొమ్మును అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనుంది.

సాగుకు భరోసా

డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్హుడైన ఒక్కో రైతుకు రూ.13,500 చొప్పున సాయంగా అందిస్తున్నాయి. దీనిలో భాగంగా 2023–24 సంవత్సరానికి ఎంపిక చేసిన రైతుల బ్యాంకు ఖాతాల్లోనే తొలి విడత సాయం రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5,500 నేరుగా జమ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఖరీఫ్ సాగుకు ముందుగానే భరోసా సొమ్ము అందించేలా జరుగుతున్న ఏర్పాట్లతో రైతుల్లో సర్వత్రా ఆనందం వ్యక్తమవుతోంది.

సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా వెన్నుదన్నుగా నిలుస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టమొచ్చినా, ప్రభుత్వం ఆదుకుంటుందనే ధీమాతో రైతులు సాగుకు సై అంటున్నారు. గతంలో సంభవించిన తుపానులతో పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని మంజూరు చేసింది. సున్నా వడ్డీ సైతం సకాలంలో జమ చేస్తుండడంతో రైతులకు విరివిగా రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు కూడా ముందుకు వస్తున్నాయి.

క్లస్టర్ పరిధిలో

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, మండపేట, రాయవరం మండలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసాకు 38,005 రైతుల అర్హులుగా అధికారులు గుర్తించారు. వారి ఖాతాల్లో 20 కోట్ల 90 లక్షల 27 వేల 500 రూపాయలు జమ కానుంది. అలాగే ఈ నెల 30 లేదా 31 తేదీల్లో పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం ఒక్కో రైతు బ్యాంకు ఖాతాకు రూ.2 వేల వంతున జమ చేయనుంది. క్లస్టర్ పరిధిలోని ఐదు మండలాల రైతులకు 7 కోట్ల 60 లక్షల 10 వేల రూపాయలు జమ చేయనున్నారు.

అర్హులైన ప్రతి రైతుకూ..



అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రైతు భరోసా సాయాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. రైతుల జాబితాను ఇప్పటికే సిద్ధం చేశాం. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికీ ప్రయోజనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

క్లస్టర్ పరిధిలో మండలాల వారీగా రైతులు, అందనున్న సాయం

మండలం	రైతులు	రైతు భరోసా (రూపాయిలు)	పీఎం కిసాన్ (రూపాయిలు)
రాయవరం	5,761	3,16,85,500	1,15,22,000
కపిలేశ్వరపురం	8,114	4,46,27,000	1,62,28,000
మండపేట	6,623	3,64,26,500	1,32,46,000
రామచంద్రపురం	9,064	4,98,52,000	1,81,28,000
కె.గంగవరం	8,443	4,64,36,500	1,68,86,000
మొత్తం	38,005	20,90,27,500	7,60,10,000

31న పీఎంపీ నరసింహమూర్తి విగ్రహావిష్కరణ


ఆవిష్కరణకు సిద్ధమైన నరసింహమూర్తి విగ్రహం

కపిలేశ్వరపురం: స్థానిక పెద్ద వంతెన సమీపంలో ఈనెల 31న గ్రామానికి చెందిన వైద్యుడు కొండమూరి నరసింహమూర్తి నిలువెత్తు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ఆయన శిష్యులు ఆదివారం తెలిపారు. నాణ్యమైన వైద్య సేవలను సమర్థవంతంగా అందించడంతో పాటు కపిలేశ్వరపురం సమీప గ్రామాల్లో అనేక మందికి పీఎంపీ వైద్యులుగా తర్ఫీదు ఇచ్చిన ఘనత కొండమూరికి దక్కుతుంది. ఈయన 2020 ఆగస్టులో చనిపోయారు. శిష్యులు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. 31న కాకినాడకు చెందిన ప్రముఖ వైద్యుడు పిండి లక్ష్మణమూర్తి ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని, పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ళ రాంబాబు పాల్గొంటారని ఆయన శిష్య బృందం తెలిపింది.

ఘనంగా వలంటీర్లకు వందనం


వలంటీర్లను సత్కరిస్తున్న మంత్రి వేణు

- 1459 మందిని సత్కరించిన మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సేవా సైన్యం వలంటీర్లకు వందనం కార్యక్రమం రామచంద్రపురం నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా జరిగింది. మండలంలోని వెంకటాయపాలెం పేపకాయల బాబ్జీ కల్యాణ మండపం వేదికగా రామచంద్రపురం రూరల్‌లోని 444 మంది సేవా మిత్రలు, ఐదుగురు సేవారత్నాలు, ఒకరు సేవావజ్రంగా, రామచంద్రపురం అర్బన్‌లో 197 మంది సేవామిత్రలు, ఐదుగురు సేవారత్నాలుగా, కె.గంగవరం మండలంలో 389 మంది సేవామిత్రలు, ఐదుగురు సేవారత్నాలు, ఇద్దరు సేవా వజ్రాలుగా, కాజులూరు మండలంలో 424 మంది సేవా మిత్రలు, ఐదుగురు సేవా రత్నాలు, ఇద్దరు సేవా వజ్రాలుగా మంత్రి వేణు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ప్రతి ఒక్కరినీ శాలువాలతో సత్కరించి, మెమెంటో, సర్టిఫికెట్‌లు అందించారు. మంత్రి వేణు మాట్లాడుతూ పూర్వ రేడియోల్లో నిత్యం వినిపించే భర్తృహరి సుభాషితాన్ని రాగయుక్తంగా పాడారు. ఆ సుభాషితం ప్రకారం నిత్యం ప్రజలతో మమేకమై సేవలు అందించే వలంటీర్లు మంచి వాక్కును ఆభరణంగా కలిగి ఉండి ప్రజలకు సేవలందించాలన్నారు. తాము అధికారంలోనికి వస్తే వలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తామని ప్రకటించిన ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడుకు వలంటీర్లు తమ సేవల ద్వారానే సరైన సమాధానం ఇవ్వాలని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు మేర్నీడి వెంకటేశ్వరరావు, ఓబిలినేని వరలక్ష్మి, వనుం వెంకటసుబ్బారావు, ఎంపీపీలు అంబటి భవాని, పంపన నాగమణి, మాతా భారతి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌టీఆర్ జయంతి వేడుకలు

మండపేట: మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు శత జయంతి వేడుకలు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం మండపేటలో ఘనంగా జరిగాయి. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్‌టీఆర్ చిత్ర పటానికి , స్థానిక కరాచీ సెంటర్‌లోని ఎన్‌టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే వేగుళ్ల పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అర్తమూరులో ఎన్‌టీఆర్ విగ్రహానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ కర్రి సత్యనారాయణరెడ్డి (జంబయ్య) తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, కపిలేశ్వరపురం, కాలేరు, నల్లూరు, టేకి, కేదారిలంకలలో ఆదివారం మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు జయంతిని టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ కాదా వెంకట రాంబాబు తదితర నాయకులు మాట్లాడుతూ ఎన్టీరామారావు ఆశయ సాధనకు అందరూ ఐక్యంగా కృషి చేయాలన్నారు.

అభిమానుల నివాళి

రామచంద్రపురం రూరల్: దివంగత ముఖ్యమంత్రి, ఆంధ్రుల ఆరాధ్య నటుడు ఎన్టీ రామారావు శత జయంతిని పురస్కరించుకుని మండలంలోని నెలపర్తిపాడులో ఘనంగా వేడుక నిర్వహించారు. ఎన్టీఆర్ అభిమానులు రాయుడు వీరబాబు, వల్లూరి సురేష్‌బాబు, ఉండవల్లి రాంబాబు, గుత్తుల నరసింహం , కొమ్ము నాగేశ్వరరావు, దేవానందం, అనుసూరి రామకృష్ణ, పీతల ఏసుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్వీట్లు పంచారు.

గాలి వాన బీభత్సం

- పలుచోట్ల విరిగి పడిన చెట్లు
- విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం

మండపేట: భానుడి భగభగలతో అల్లాడిన జన జీవనానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉపశమనం కలిగించింది. ఆదివారం సాయంత్రం మండపేట, పరిసర గ్రామాల్లో కారుమబ్బులు కమ్ముకుని, ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది.కొద్ది రోజులుగా అధిక ఎండలు, వేడి గాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంది. మధ్యాహ్న సమయంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అధిక వేడి, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రమయ్యే సరికి ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు, వర్షంతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. చల్లటి గాలులతో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం లభించింది.

నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

ఈదురుగాలుల ప్రభావంతో సాయంత్రం నాలుగు గంటల నుంచి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. మండపేట, ఏడిద, ద్వారపూడి తదితర చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడి విద్యుత్తు వైర్లు తెగిపడ్డాయి. ఏడీఈ జి. తిరుమలరావు నేతృత్వంలో సిబ్బంది చెట్టు కొమ్మలు తొలగించి రాత్రి 8.60 గంటల సమయానికి సరఫరాను పునరుద్ధరించారు.

రాయవరం: మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షపు జల్లులు పడ్డాయి. ఉదయం నుంచి విపరీతమైన ఎండ, ఉక్కపోతకు గురైన ప్రజలు సాయంత్రం వీచిన ఈదురు గాలులు, పడిన చిరుజల్లులకు వాతావరణం చల్లబడినట్టయ్యింది. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా దట్టమైన మబ్బులు కమ్ముకొని చీకట్లు అలముకున్నాయి.

ఈదురుగాలులతో భారీ వర్షం

కాజులూరు: మండల గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం 10 గంటల నుంచే భానుడు ఉగ్రరూపం చూపించగా సాయంత్రం నాలుగు గంటల సమయంలో అకస్మాత్తుగా ఆకాశంలో మేగాలు కమ్ముకుని చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరౌతున్న ప్రజానీకానికి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై చల్లగాలులు వీయటంతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది. అయితే కొద్దిసేపటిలోనే చిరుజల్లులు కాస్తా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షంగా మారి రాత్రి వరకూ వర్షం కురుస్తూనే ఉండటంతో ప్రజలు ఆందోళనలకు గురయ్యారు. ఈదురు గాలులకు మండల గ్రామాల్లో పలు చోట్ల చెట్లు విరిగిపడగా పలు చోట్ల కరెంటు స్తంభాలు నేలకొరిగి వైర్లు తెగిపోవటంతో విద్యుత్ స్తంభించిపోయింది. రోడ్డుపై విరిగిన చెట్టుకొమ్మలను స్థానికులు తొలగించే ప్రయత్నాలు చేస్తుండగా నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను నిలబెట్టి సరఫరాను పునరుద్ధరించేందుకు ట్రాన్స్‌కో సిబ్బంది ముమ్మర చర్యలు చేపట్టారు.

చల్లబడిన వాతావరణం

కె.గంగవరం: గత వారం రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండడం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి ఆకాశం మేఘావృతంగా మారి ఈదురుగాలులు, ఉరుములతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఎండ తీవ్రతతో వృద్ధులు, చంటిపిల్లలు సతమతమవుతున్న తరుణంలో వాతావరణ చల్లబడడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. రోహిణీ కార్తె ప్రభావంతో ఎండ తీవ్రత మరో 10 రోజుల వరకు ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


గొల్లపాలెంలో ఈదురుగాలుల బీభత్సం


మండపేటలో ఈదురు గాలులు


ఏడిదలో తెగిపోయిన విద్యుత్ వైర్లు


మండపేట బస్టాండు వద్ద వర్షం


కె.గంగవరంలో మేఘావృతమైన ఆకాశం


రాయవరంలో ఈదురుగాలులు, చిరుజల్లులతో కూడిన వాతావరణం

మంచు.. ఎండ.. వర్షం

రామచంద్రపురం: ఒకే రోజున మూడు కాలాల మంచు.. ఎండ.. వర్షం ఆదివారం నియోజకవర్గంలో చోటు చేసుకుంది. ఉదయం 5 గంటలకు శీతాకాలం మాదిరిగా విపరీతమైన మంచు కురిసింది. కాగా ఉదయం 8 నుంచి ఎండకాలంలానే భగభగమంటూ సూరీడు మండిపోయాడు. సాయంత్రం 5 గంటలకు వరకు ఎండ మండిపోగా తదనంతరం నల్లమబ్బులతో నిండిపోయి గాలివాన వర్షంతో చల్లని వాతావరణం ఏర్పడింది. ఇలా ఒకే రోజున శీతాకాలం మంచు, ఎండాకాలం ఎండ, వర్షకాలం గాలి వానలు ఒకే రోజున రామచంద్రపురంలో చోటు చేసుకున్నాయి.


ఉదయం 5.30 గంటలకు కురిసిన మంచు


మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎండ


సాయంత్రం 5.30 గంటలకు కురిసిన వర్షం

ఇక ఇంటికే పోషకాహారం..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో జూలై 1 నుంచి అమలు
- రెండు విడతలుగా అందించేందుకు ప్రణాళికలు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు


యర్రపోతవరంలో లబ్ధిదారులకు పోషకాహార కిట్లు అందిస్తున్న దృశ్యం

కె.గంగవరం: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనతను అధిగమించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ పథకాల ద్వారా లబ్ధిదారులకు ప్రతి నెలా పోషకాహారాన్ని పంపిణీ చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు 300 నుంచి 500 మీటర్ల దూరంలో ఉండి కేంద్రాలకు వెళ్లి పోషణ కిట్లు తీసుకునేందుకు గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇంటి వద్దకే పోషకాహారం అందించాలని నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో జులై ఒకటి నుంచి ఇంటి వద్దకే లబ్ధిదారులకు పోషకాహార కిట్లను అందజేయనున్నారు. నిర్దేశిత పరిమాణంలో సరుకులను ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఇంటికే ఇవ్వాలని..

ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని కేంద్రంలోనే తీసుకుంటున్నారా? ఇంటికి తీసుకువెళ్లేందుకు ఇష్టపడుతున్నారా? అని ఇప్పటికే లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ అభిప్రాయ సేకరణలో లబ్ధిదారులకు అధిక సంఖ్యలో ఇంటికే ఇవ్వాలని సూచించడంతో ప్రభుత్వ ఈ నిర్ణయం తీసుకుంది.

కేంద్రాలకు లబ్ధిదారులు రాకపోవడంతో..

కరోనా సమయంలో రెండేళ్ల పాటు టీహెచ్‌ఆర్ (టేక్ హోం రేషన్) పేరుతో లబ్ధిదారులకు సరుకులు ఇళ్లకే అందించారు. కోవిడ్ తగ్గుముఖం పట్టడంతో అంగన్‌వాడీ కేంద్రాలు మళ్లీ తెరచి వాటి ద్వారానే పోషకాహారం అందించే వారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలకు ఇస్తున్న ఆహారం దుర్వినియోగమవుతోందన్న ఉద్దేశంతో ప్రభుత్వం గత ఏడాది జూన్ ఒకటి నుంచి అంగన్‌వాడీ కేంద్రంలోనే భోజనం వండి అందించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం అమలు అవుతున్నా పూర్తి స్థాయిలో లబ్ధిదారులు ఆసక్తి చూపకపోవడంతో కొంత వెసులుబాటు కల్పించారు. నెలలు నిండడం, ఆరోగ్య సమస్యలు, చిన్నారుల సంరక్షణ వంటి కారణాలతో కేంద్రాలకు రాలేమని లబ్ధిదారులు చెప్పడంతో పోషకాహారం ఇంటికి తీసుకువెళ్లేందుకు అవకాశం కల్పించారు. మెజార్టీ సభ్యులు ఇంటికే సరుకులు ఇవ్వాలని సూచించడంతో నెలలో రెండు విడతలుగా అందించేందుకు చర్యలు చేపట్టారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు అమలు: – ఎ.గజలక్ష్మి, సీడీపీఓ, కపిలేశ్వరపురం ప్రాజెక్టు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం జూలై నుంచి సరకుల రూపంలో లబ్ధిదారులకు అందించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రతి నెలా ఒకటో తేది నుంచి ఐదో తేదీ లోగా మొదటి విడతగా బియ్యం, కంది పప్పు, నూనె, కోడిగుడ్లు, పాలు, రాగిపిండి, అటుకులు, బెల్లం, చిక్కీలు, ఎండు ఖర్జూరం అందిస్తారు. రెండు విడతగా 16, 17 తేదీల్లో కోడిగుడ్లు, పాలు అందిస్తారు.

కపిలేశ్వరపురం ప్రాజెక్టు పరిధిలో బాలింతలు, గర్భిణులు

మండలం	బాలింతలు	గర్భిణులు
కె.గంగవరం	300	363
కపిలేశ్వరపురం	320	386
మండపేట	401	450
కాజులూరు	360	403
రామచంద్రపురం	470	503

సంపూర్ణ పోషణ కిట్‌లో..

అటుకులు	కిలో
రాగిపిండి	కిలో
జొన్నపిండి	కిలో
కందిపప్పు	కిలో
బియ్యం	3 కిలోలు
బెల్లం	250 గ్రాములు
చిక్కీలు	250 గ్రాములు
ఎండు ఖర్జూరం	250 గ్రాములు
నూనె	500 గ్రాములు
గుడ్లు	25
పాలు	5 లీటర్లు

ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణుకు, బాలింతలకు పోషకాహారం ఇంటికి అందించడం అభినందనీయం. ప్రభుత్వం ప్రజల మంచి కోరే విధానాలు అమలు చేస్తోంది. లబ్ధిదారులకు ఇకపై పోషకాహారం తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తవు.

– బత్తుల విజయకుమారి మాజీ సర్పంచ్ కుందూరు

అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లడం లేదు



పోషకాహారం తీసుకోవడానికి లబ్ధిదారులకు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లడానికి ఇష్టపడడం లేదు. ప్రభుత్వ వారి ఉద్దేశాలను దృష్టిలో ఉంచుకుని ఇంటి వద్దకే రేషన్ అందించడం బాగుంది. ఈ నిర్ణయం రానున్న కాలంలో మంచి ఫలితాలను ఇస్తుంది.

– కదలి విజయదుర్గ, మండల కోఆప్షన్ సభ్యురాలు, కె.గంగవరం

అంగరలో పూర్వ విద్యార్థుల భేటీ


అంగర హైస్కూల్ 2002-03 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల 2002-03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల ఆవరణలో సమావేశమయ్యారు. 20 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులందరూ కలుసుకోవడంతో సంభ్రమాశ్చర్యానికి గురయ్యారు. పాఠశాలలో ఐదేళ్ల పాటు గడిపిన రోజులను గుర్తు చేసుకుంటూ పాఠశాల ఆవరణలో తిరిగారు. ఆటలాడుకున్న మైదానంలో క్రికెట్ ఆడుతూ సరదాగా గడిపారు. ఒకరినొకరు కుటుంబ సభ్యుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు డి.సత్తిరాజు వంగా శ్రీను, సలాది శ్రీను, ఏడుకొండలు, వేల్పూరు శ్రీనివాస్, పరస జనార్దన్, దయామణి, వాకా కృష్ణకుమారి, రామానుజం, సుబ్రహ్మణ్యం, జానకిరామయ్యలను సత్కరించారు. తాము ఎక్కడెక్కడ, ఎలా స్థిరపడిందీ ఉపాధ్యాయులతో ముచ్చటించారు. పాఠశాల ఆవరణలో ఫొటో దిగారు.